


వరంగల్‌లోని మడికొండ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే స్క్రీన్ ముందు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

# ఓటమి గుట్టు.. ఒట్లతో రట్టు

- రేవంత్‌ను వణికిస్తున్న పరాజయ భయం
- అందుకే ఎక్కడికక్కడ దేవుళ్లపై ప్రమాణం
- రుణ మాఫీపై రైతులను నమ్మించే యత్నం
- రెఫరెండంపై నోరు మెదపని సీఎం
- పాలమూరులో పరువు కోసం ఆరాటం

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): రశీదు తప్పితే మసీదు తప్పదన్నది తెలంగాణలో నానుడి. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే చివరికి దేవుడిపై ఒట్టేయడం గ్రామీణ ప్రాంతాల్లో పరిపాటి. ప్రస్తుతం మన ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల లోపున్న వ్యవసాయ రుణాలను 100 రోజుల్లోగా మాఫీ చేస్తామని ఆ పార్టీ తన మేనిఫెస్టోలో లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. టీపీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ సైతం నిరుడు డిసెంబర్ 9న ఎన్నికల ప్రచార వేదికపై నుంచి ఇదే మాట ఇచ్చారు. చివరికి వారు ఆశించినట్టుగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కానీ, వ్యవసాయ రుణాల మాఫీకి ఆయన విధించిన 100 గడువు ఎప్పుడో ముగిసినా.. అధికార పీఠమెక్కి 5 నెలలు కావస్తున్నా ఆ హామీకి దిక్కు లేకుండా పోయింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. తమకు ఇచ్చిన మాట ఏమైందని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులను అడుగడుగునా నిలదీస్తున్నారు. మరోవైపు 6 గ్యారంటీలను ఎప్పుడు నెరవేరుస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇది త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం చూపితే తన ముఖ్యమంత్రి కుర్చీ కిందికి నీళ్లు వస్తాయన్న భయంతో రేవంత్ వణికిపోతున్నారు. అందుకే ఇప్పుడు ఆయన ఎక్కడికెళ్లినా ఆగస్టు 15లోగా రైతు రుణాలను మాఫీ చేస్తానంటూ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారు. ఈసారికి తనను నమ్మాలంటూ జనాన్ని వేడుకొంటున్నారు.

> **భద్రాద్రి రాముడి సాక్షిగా..**
> నా తెలంగాణ రైతు సోదరులకు భద్రాద్రి రాముడి సాక్షిగా, మంత్రి తుమ్మల సాక్షిగా మాట ఇస్తున్నా.. పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి రుణం తీర్చుకుంటా. బరాబర్ రూ.500 బోనస్ ఇచ్చి వడ్లు కొంటాం. మా వంద రోజుల పాలన చూడండి. మేం అమలు చేసిన పథకాలు చూసి 14 లోక్‌సభ స్థానాల్లో గెలిపించండి.
> - ఈ నెల 19న మహబూబాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

### రెఫరెండమ్ ఏమైంది?

పార్లమెంట్ ఎన్నికలు తమ 100 రోజుల పాలనకు రెఫరెండం అని సీఎం రేవంత్ తన ప్రచార సభలతో పాటు ప్రెస్‌మీట్లలో ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. పలువురు మంత్రులు సైతం తమ ఎన్నికల ప్రచార సభల్లో ఇదే మాట చెప్తూ.. రాష్ట్రంలో కనీసం 14 లోక్‌సభ సీట్లు గెలిచితీరుతామన్న ధీమాను వ్యక్తం చేస్తూ వచ్చారు. కానీ, తెలంగాణలో కాంగ్రెస్‌కు ఏమాత్రం విజయావకాశాలు లేవంటూ ఆ పార్టీ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తాజా పరిస్థితిని ఇటీవల అధిష్ఠానానికి నివేదించినట్టు సమాచారం. దీంతో కంగుతిన్న కాంగ్రెస్ పెద్దలు తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను హుటాహుటిన హైదరాబాద్‌కు పంపారు. ఆ వెంటనే ఆయన సీఎం రేవంత్, మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి ఫ్లాష్ సర్వే నివేదికను వారి ముందుంచినట్టు తెలుస్తున్నది. రేవంత్ సర్కారుపై స్వల్ప వ్యవధిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నదని, ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయకపోవడంపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్న విషయాన్ని రాష్ట్ర నాయకత్వానికి వేణుగోపాల్ వివరించి, తెలంగాణలో కాంగ్రెస్‌కు మెజార్టీ లోక్‌సభ సీట్లు లభించే పరిస్థితి లేదని చెప్పినట్టు వినికిడి. అందుకే రెఫరెండంపై సీఎం రేవంత్ ఇప్పుడు ఎక్కడా నోరు మెదపడం లేదని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి.

### సానుభూతి కోసం పాకులాట

ప్రస్తుతం సీఎం రేవంత్ ఓవైపు ఆగస్టు 15లోగా వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టేసి చెప్తూనే మరోవైపు ప్రజల నుంచి సానుభూతి పొందడానికి ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే ఆయన 'రైతు బిడ్డ సీఎం కావద్దా? పేదోడి బిడ్డ సీఎం కాకూడదా? మా ప్రభుత్వం పడిపోతుందా? మా ప్రభుత్వమే ఎందుకు పడిపోవాలి? కేంద్రంలో పదేండ్ల నుంచి కొనసాగుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం పడిపోతుందని ఎందుకు అనడం లేదు? నేను సీఎంగా ఉంటే ఓర్వలేకపోతున్నారా?' అన్ని ప్రశ్నిస్తున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

### పదే పదే పాలమూరుకు ఉరుకులు

సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి గెలుపు అగ్నిపరీక్షగా మారింది. అక్కడ ఫలితం అటు ఇటు అయితే తన సీఎం సీటుకే ఎసరు వస్తుందని రేవంత్ భయపడుతున్నారు. అందుకే మహబూబ్‌నగర్‌లో వంశీచందర్‌ను ఓడించడం ద్వారా రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతున్నదని పదే బహిరంగ సభల్లోనే ఆరోపిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర కాంగ్రెస్‌లోని తన ప్రత్యర్థులకు అస్త్రంగా మారుతాయన్న భయంతో పదే పదే మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లి వంశీచందర్‌ను గెలిపించకపోతే తన పరువు పోతుందని వాపోతున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన తర్వాత రేవంత్ ఇలా ఇప్పటికే ఐదుసార్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించడం గమనార్హం.

> **యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా..**
> ఎన్ని అవాంతరాలు ఎదురైనా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సాక్షిగా ఆగస్టు 15 లోపు రాష్ట్రంలోని రైతులు అందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం.
> - ఈ నెల 21న భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి

> **మేడారం, రామప్ప, వేయిస్తంభాలగుడి సాక్షిగా..**
> రామప్ప సాక్షిగా, మేడారం సమ్మక్క-సారక్క సాక్షిగా, వేయిస్తంభాల గుడి సాక్షిగా ఆగస్టు 15లోగా రైతులకు పంట రుణమాఫీ చేస్తున్నాను. ఆగస్టు 15 కల్లా రుణమాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ విసిరారు. నేను కూడా ఈ వేదికపై నుంచి హరీశ్‌రావుకు చెప్తున్నా.. ఆగస్టు 15న నీ రాజీనామా పత్రం జేబులో పెట్టుకొని సిద్ధంగా ఉండు.
> - ఈ నెల 24న వరంగల్‌లో సీఎం రేవంత్

> **మెదక్ చర్చి, ఏడుపాయల దుర్గమ్మ సాక్షిగా..**
> మెదక్ చర్చి, ఏడుపాయల దుర్గమ్మ సాక్షిగా నేను మాట ఇస్తున్నాను. ఆగస్టు 15లోగా పంట రుణమాఫీ చేసే బాధ్యత నాది. వచ్చే పంట సీజన్‌లో ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనే పూచీ కూడా నాదే.
> - ఈ నెల 20న మెదక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# రాజీనామా పత్రం జేబులో పెట్టుకో

మొదటిపేజీ తరువాయి...

హరీశ్‌రావు సవాలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై బుధవారం వరంగల్‌లోని మడికొండలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అంటున్నడు. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి నీ సంగతి తేలుస్తా. హరీశ్‌రావు రాజీనామా పత్రం జేబులో పెట్టుకుని రెడీగా ఉండాలి' అని వ్యాఖ్యానించారు. అయితే, పంద్రాగస్టులోగా రుణమాఫీతో పాటు ఇతర హామీలు అమలు చేయకపోతే ఏమిటన్న దానిపై మాత్రం రేవంత్ మాట్లాడకపోవడం గమనార్హం. రుణమాఫీ చేయకుంటే రాజీనామాకు సీఎం సిద్ధమా? అన్న సవాల్‌పై రేవంత్‌రెడ్డి మౌనం పాటించారు. రుణమాఫీపై ఎక్కడికి వెళ్తే, అక్కడి దేవుండ్ల సాక్షిగా ప్రమాణం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ ప్రచారంలోనూ అదే ఎత్తు వేశారు. 'రామప్ప దేవాలయం శివుడి సాక్షిగా, వేయిస్తంభాల గుడి సాక్షిగా, మేడారం సమ్మక్క సాక్షిగా మాట ఇస్తున్నా.. పంద్రాగస్టులోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తా' అని పేర్కొన్నారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ చేశారు. మేధావులు, నిపుణుల మధ్య చర్చ పెడదామని, దమ్ముంటే రావాలని అన్నారు. 'కేసీఆర్‌కు నేను సవాల్ విసురుతున్నా. నువ్వు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమైతే చర్చకు రా? నీకు దమ్ము, ధైర్యం ఉంటే కాళేశ్వరంపై చర్చకు రా' అని పేర్కొన్నారు.

### బీజేపీతో ప్రజాస్వామ్యానికే ప్రమాదం

బీజేపీ రూపంలో దేశానికి ప్రమాదం పొంచి ఉన్నదని, ఆ పార్టీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. దేవుడి పేరు మీద ప్రజల మధ్య చిచ్చు పెట్టేవారికి గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ గెలిస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తొలగిస్తుందని, రాజ్యాంగాన్ని మారుస్తుందని విమర్శించారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏమీ చేయలేదని మండిపడ్డారు. అరూరి రమేశ్ రంగులు, అంగీలు మార్చి బీజేపీ అభ్యర్థిగా వస్తున్నాడని, ఆయన గెలిస్తే అనకొండగా మారి అందరి భూములు అక్రమిస్తాడని ఆరోపించారు. వరంగల్‌కు రాష్ట్రంలో రెండో రాజధానిగా అర్హతలు ఉన్నాయని, తానే స్వయంగా వరంగల్‌లో కూర్చొని నగర సమస్యలను పరిష్కరిస్తానంటూ పలు హామీలు ఇచ్చారు.

### రేవంత్ ప్రసంగం వేళ ఖాళీ కుర్చీలు

మడికొండలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి జనజాతర బహిరంగసభకు జనం నుంచి స్పందన కరువైంది. ఈ సభను లక్ష మందితో నిర్వహిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటించినప్పటికీ, అందులో పావువంతు కూడా రాలేదని పరిశీలకులు భావిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం మొదలుపెట్టగానే సభకు వచ్చిన ఆ కొద్దిమంది ఇంటికి వెళ్లడం మొదలుపెట్టారు. సీఎం ప్రసంగం పూర్తికాక ముందే సభలో ముందు వరుసలో కూర్చున్న, వెనుక ఉన్న వారు చాలామంది వెళ్లిపోయారు. కాంగ్రెస్ జనజాతర సభకు జన స్పందన లేకపోవడం, వచ్చిన వారు మధ్యలోనే వెళ్లిపోవడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో ఆందోళన మరింత పెరిగింది.

## రేవంత్ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

### కలెక్టర్‌కు బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు

ఎదులాపురం, ఏప్రిల్ 24: ఈ నెల 22న ఆదిలాబాద్‌లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున జరిగిన సభలో పాల్గొని ఓటర్లను ప్రభావితం చేసేలా.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రసంగించి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బుధవారం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఫిర్యాదు చేశారు. నిబంధనలను ఉల్లంఘించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. 'ఆత్రం సుగుణ గెలవకపోతే.. ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 లక్షలు, ఆర్టీసీ ఫ్రీబస్, రూ.500 సిలిండర్ ఆగిపోయే ప్రమాదం ఉంది' అని వ్యాఖ్యానించారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, మాజీ ఎంపీపీ సేవ్వ జగదీశ్, నాయకులు సతీశ్, ఆశీఫ్, ఖలీమ్ సాహెబ్‌లు ఉన్నారు.

## సీఎంగా భట్టి విక్రమార్క పనికిరారా?: మందకృష్ణ



ఖైరతాబాద్, ఏప్రిల్ 24: ముఖ్యమంత్రి పదవికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పనికిరారా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఒక సీఎం దిగిపోతే డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న వారే సీఎం అవుతారని, భట్టి విక్రమార్క దళితుడైనందు వల్లే సీఎంగా పనికిరారన్నది ఆయన భావనలా కనిపిస్తున్నదని ఆరోపించారు. మంత్రి వెంకట్‌రెడ్డి సీఎం అవుతారన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలే ఆయనలో ఉన్న కులతత్వ పోకడలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆదివాసీ అయిన మంత్రి సీతక్క, దళితుడైన మరో మంత్రి రాజనర్సింహ, బీసీ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పేర్లు ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. వారందరూ సీఎం రేవంత్‌రెడ్డి కంటే ముందే అర్హులని, కాంగ్రెస్‌ను ఆయనే గెలిపించాడన్న భ్రమలో ఆ పార్టీ అధిష్ఠానం రేవంత్‌ను సీఎంను చేసిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి కులతత్వ వైఖరితో కాంగ్రెస్ పార్టీకి ఇతర అన్ని సామాజికవర్గాలను దూరం చేస్తున్నారని విమర్శించారు. ముగ్గురు మంత్రులతోపాటు 17 మంది తన సామాజికవర్గం వారిని కీలక అధికారులుగా నియమించుకున్నారని ఆరోపించారు. ఏకంగా 14 కార్పొరేషన్ చైర్మన్ పదవులను సైతం సొంత సామాజికవర్గానికి ముట్టజెప్పారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలకు దక్కాల్సిన నిజామాబాద్, భువనగిరి, నల్లగొండ, మల్కాజిగిరి, చేవెళ్ల, మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానాలను జీవన్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, పట్నం సునీతారెడ్డి, రంజిత్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డికి ఇప్పించుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సీఎం సామాజికవర్గ పాలన సాగుతున్నదని విమర్శించారు. సీఎం కులతత్వ వైఖరిపై సాక్ష్యాలు, రుజువులు తన వద్ద ఉన్నాయని, చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.


### మాదిగలకు కాంగ్రెస్ మోసం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 24: ఎంపీ టికెట్, నామినేటెడ్ పదవులు మాదిగలకు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు వైఖరికి నిరసనగా గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం మాదిగ రాజ్యాధికార పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగల ఆత్మగౌరవ బస్సు యాత్రను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎం కోటేశ్వరరావు, జగదీశ్ మాదిగ, అమృత్, ప్రవీణ్ జయరాజ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణం చేద్దాం రా

మొదటిపేజీ తరువాయి...

ఆగస్టు 15లోగా హామీలను అమలు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ఐదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్నదానికంటే కోట్ల మంది తెలంగాణ ప్రజలకు రుణమాఫీ, ఆరుగ్యారెంటీలు అందితే అదే తనకు సంతృప్తినిస్తుందన్నారు. తాను ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని, పదవుల త్యాగ తనకు కొత్తకాదని, గతంలో మంత్రి, రెండుసార్లు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని చెప్పారు. పదవుల కంటే తెలంగాణ ప్రజల ప్రయోజనమే తనకు ముఖ్యమని స్పష్టంచేశారు.



### కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతున్నదనే ఆపదమొక్కులు

'ఆరు గ్యారెంటీలు, 13 హామీలు వంద రోజుల్లో అమలు చేయక కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతున్నది. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి తొండి రాజకీయాలు చేస్తున్నడు.. ఆపదమొక్కులు మొక్కుతున్నడు' ఎన్ని చేసినా ప్రజలు కాంగ్రెస్‌ను, రేవంత్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని హరీశ్ దుయ్యబట్టారు. హామీలు అమలు చెయ్యిమంటే బీఆర్‌ఎస్‌ను రద్దు చేస్తరా అని రేవంత్ సవాల్ చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని, ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### సోనియా లేఖకు విలువ లేదా?

'అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేస్తం, హామీల అమలు బాధ్యత నాది అని సోనియాగాంధీ స్వయంగా తెలంగాణ ప్రజలకు తన సంతకంతో లేఖ రాసింది. ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రోజూ ప్రజలను కలుస్తరని సోనియా అన్నరు. వందరోజుల్లో హామీల అమలు అని అన్ని పత్రికల్లో ఫుల్ పేజీ యాడ్‌లు ఇచ్చారు. కాంగ్రెస్ పాలన వచ్చిన నాలుగు నెలలు కావస్తున్నా హామీల అమలు ఏమైంది? సోనియాగాంధీ రాసిన లేఖకు కూడా విలువలేదా?' అని హరీశ్ ప్రశ్నించారు. ఆరింటిలో ఐదు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేశామని రేవంత్‌రెడ్డి చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఉచిత బస్సు మినహా అంతా తుస్సేనని హరీశ్ ఎద్దేవా చేశారు.

### రాహుల్ కాంగ్రెస్ వేరు.. రేవంత్ కాంగ్రెస్ వేరు

'రాహుల్ అదానీని చోర్ అంటుంటే రేవంత్ అదానీని మంచోడంటున్నడు.. రాహుల్‌ను భాయ్ అని, మోదీని బడే భాయ్ అంటున్నడు. అంటే మళ్లీ మోదీ ప్రధాని కావాలని రేవంత్‌రెడ్డి కోరుతున్నడా? రాహుల్‌గాంధీ కాంగ్రెస్ వేరు, రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ వేరా' అని హరీశ్ ప్రశ్నించారు. తాను ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా రేవంత్ చెప్పుకొంటున్నాడని, ఆయన ఎప్పుడైనా బీజేపీలోకి వెళ్లే అవకాశముందన్నారు.

### కుటుంబ సభ్యులకు టికెట్ కోసమే మంత్రుల ఆరాటం

ఖమ్మంలో ప్రజలు, రైతులు తాగు, సాగునీరు లేక ఇబ్బంది పడుతుంటే.. ఇక్కడి మంత్రులు మాత్రం సమస్యలను గాలికి వదిలి తమ కుటుంబసభ్యులకు టికెట్ల కోసం ఢిల్లీ, బెంగుళూరుకు చక్కర్లు కొట్టారని హరీశ్ విమర్శించారు. కృష్ణా జలాలు రాకపోయినా గోదావరి జలాలతో ఖమ్మంజిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టుకు బీఆర్‌ఎస్ రూపకల్పన చేసిందని గుర్తుచేశారు. గాలిలో తేలియాడుతున్న కాంగ్రెస్ పార్టీ కిందికి దిగాలి అంటే ఖమ్మంలో నామా నాగేశ్వర్‌రావును ఎంపీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఖమ్మంలో ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రేవంత్.. తీరు మార్చుకో

- లేదంటే కాంగ్రెస్ మనుగడ కష్టం
- సమన్వయంలో రేవంత్‌రెడ్డి విఫలం
- మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ
- కంటోన్మెంట్, మల్కాజ్‌గిరిలో నామినేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ప్రవర్తన మార్చుకోవాలని, లేదంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టమని, అందరినీ కలుపుకొని పోవడంలో రేవంత్‌రెడ్డి విఫలమవుతున్నారని మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ విమర్శించారు. కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాలకు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వ్యతిరేకులు, ఉద్యమ ద్రోహులు, తెలుగుదేశం, కాంగ్రెస్ చేతుల్లో ఈ ప్రభుత్వముందని మండిపడ్డారు. తెలంగాణ కోసం పోరాడినవాళ్లను వదిలి ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి కాంగ్రెస్ పార్టీ సీట్లు కేటాయించడం సరికాదన్నారు. ఎస్సీలకు లోక్‌సభ సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. సభ్యత్వం లేనివాళ్లను, జెండాలు కూడా మోయనివాళ్లను, పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి కేసులు పెట్టిన వాళ్లను రాత్రికి రాత్రి తీసుకొచ్చి ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఓటమి అంచున ఉన్నదని, అధినాయకత్వం పట్టించుకోకుంటే తానే ఐదేండ్లలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని చెప్పారు.

## ఓట్ల కోసం ఒట్లు పెడ్తవా?

- రేవంత్‌పై డీకే అరుణ ఆగ్రహం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 24: ఓట్ల కోసం ఒట్టు రాజకీయాలా..? ఇదెక్కడి నీచ రాజకీయమంటూ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఆమె స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు గుప్పించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయలేక చేతులెత్తేసి ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సీఎం రేవంత్ దేవుళ్లపై ఒట్లు పెడుతున్నారన్నారు. ఆగస్టులోగా రుణమాఫీ అంటూ రైతులను మభ్య పెట్టేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోసకారికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు.

## కడియం, తెల్లంపై అనర్హత వేటు వేయాలి

- హైకోర్టులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): స్టేషన్‌ఘన్‌పూర్, భద్రాచలం స్థానాల నుంచి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై ఆ పార్టీ చిహ్నంపై ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని సవాల్‌చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హైకోర్టును ఆశ్రయించారు. బీఆర్‌ఎస్ తరఫున గెలిచాక కాంగ్రెస్‌లో చేరారని, పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఇద్దరు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం శ్రీహరి, వెంకట్రావు ఎమ్మెల్యేలుగా కొనసాగేందుకు అర్హులు కాదని తెలిపారు.

# అర్వింద్ వ్యాఖ్యలపై మౌనమేల?

- రేవంత్ పార్టీ మారుతారంటూ ఆరోపణలు
- రన్నింగ్ కామెంట్రీలా చెప్తున్న అర్వింద్
- అయినా స్పందించని రేవంత్‌రెడ్డి
- సొంతపార్టీ నేతల్లోనే అనుమానాలు

> 'ఆగస్టు వరకు సీఎంగా రేవంత్‌రెడ్డి ఉంటడో ఉండడో అంటున్నరు. రేవంత్‌రెడ్డి కుర్చీని శ్రీరాముడే రక్షించాలె'

> 'రేవంత్‌రెడ్డి బ్యాక్‌గ్రౌండ్ ఏబీవీపీ. లోపల హిందూత్వ ఉన్నది. కాంగ్రెస్ ఖాళీ అయిపోతదని అంటున్నరు. అందుకే రేవంత్‌రెడ్డి ఏమీ చేయలేక గోసపడుతున్నడు'

> 'కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో నిలకడ ఉండదు. గెలిపించినా పార్టీలు మారుతనే ఉంటరు. 50 మంది ఎమ్మెల్యేలతో పార్టీ మారేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నరు. రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సరైంది కాదు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీజేపీలో చేరుతడు'.




హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇటీవల వరుసగా చేసిన ఆరోపణలు ఇవి. రాజకీయ వర్గాల్లో, ప్రత్యేకించి కాంగ్రెస్ వర్గాల్లో ఇవి కల్లోలం రేపుతున్నాయి. అర్వింద్ వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి చీల్చిచెండాడుతారని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అర్వింద్‌పై రేవంత్ తన సహజశైలికి భిన్నంగా వ్యవహరించేసరికి కాంగ్రెస్ నేతలు విస్తుపోతున్నారు. అర్వింద్‌కు రిన్ సబ్బుకు రన్‌సబ్బుకు తేడా తెలియదని అంటూనే.. 'మిత్రమా' ధర్మపురి అర్వింద్‌గారు' అని రేవంత్ సంబోధించడం గమనార్హం. దీనికితోడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తామే సీఎం అవుతామని భావించిన రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పోటీలుపడి తమకు 25 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేకించి నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధ్య నెలకొన్న అంతరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మరింత పెంచేలా ముఖ్యమంత్రి కావడానికి అన్ని అర్హతలున్న నాయకుడిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీర్తించడం వంటి పరిణామాలు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు ప్రచారంవైపు మళ్లాయే కానీ, లేదంటే పరిస్థితులు వేరుగా ఉండేవని చెప్తున్నారు.

### వ్యతిరేకవర్గం అనుమానాలు

బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ మంత్రులు విమర్శించినా, ఆరోపణలు చేసినా ఒంటికాలిపై లేచే రేవంత్‌రెడ్డి.. బీజేపీలో చేరతారని అర్వింద్ రన్నింగ్ కామెంట్రీలా చెప్తున్నా ఎందుకు స్పందించడం లేదని ఆయన వ్యతిరేకవర్గం అనుమానం వ్యక్తం చేస్తున్నది. అర్వింద్ ఆరోపణలు నిజమైతే కాంగ్రెస్‌కు ప్రమాదం పొంచి ఉన్నట్టేనని సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అర్వింద్ వ్యాఖ్యలపై రేవంత్ స్పందించకపోవడం నేతల్లో రేకెత్తిన అనుమానాలను మరింత బలపరుస్తున్నదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

## లోకం పోకడ




## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 44.9°c | 32.8°c |
| రంగారెడ్డి | 42.6°c | 19.9°c |
| ఆదిలాబాద్ | 42.4°c | 22.7°c |
| ఖమ్మం | 42.0°c | 27.0°c |
| మహబూబ్‌నగర్ | 42.0°c | 26.0°c |
| వరంగల్ | 41.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 40.0°c | 26.6°c |
| నిజామాబాద్ | 40.5°c | 26.7°c |
| కరీంనగర్ | 39.0°c | 27.0°c |
| మెదక్ | 21.6°c | 41.1°c |

## భానుడి భగభగ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా భగభగలాడుతున్న ఎండలపై భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. తెలుగు రాష్ర్టాల్లో ఈ నెల 28వ తేదీ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని స్పష్టంచేసింది. మధ్యాహ్నం నిప్పుల ఎండలు, రాత్రి వేడిగాలులు ఉంటాయని హెచ్చరించింది. దక్షిణ తెలంగాణ, రాయలసీమ, యానాంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు డిగ్రీలు అదనంగా గరిష్ఠంగా 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరంలో లక్ష్మి (55) మంగళవారం ఉపాధి హామీ పనులు చేస్తూ వడదెబ్బకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్)మండలం కోటినాయక్‌తండాకు చెందిన ధరావత్ గోల్యా (70), రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం బాలరాజ్‌పల్లిలో నాగుల బాలయ్య (50) అనే రైతు వడదెబ్బతో మరణించారు.